# సాక్షి పెద్దపల్లి

శనివారం : 29 : ఏప్రిల్ : 2023






## మంత్రి ప్రత్యేక పూజలు

గోదావరిఖని: స్థానిక జయదుర్గాదేవి ఆలయంలో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



## అభివృద్ధి పనులపై సమీక్ష

గోదావరిఖని: మేడిపల్లి ఓసీపీ విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై శుక్రవారం ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఆసుపత్రి పారిశుధ్య సిబ్బందికి బీజేపీ మద్దతు



మాతాశిశు ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, బీజేపీ నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు బకాయి ఉన్న 9 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని బీజేపీ దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, జిల్లా అధికార ప్రతినిధి అక్కెపల్లి క్రాంతి డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించాలంటూ కార్మికులు సమ్మెకు దిగినా పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నించారు. పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులకు సదరు కాంట్రాక్టర్ నుంచి వెంటనే వేతనాలందేలా చూడాలని, పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలన్నారు. సమ్మెతో ఆసుపత్రికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇక్కట్లు పడుతున్నారని పేర్కొన్నారు. జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. నాయకులు మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, నరేశ్, నాగరాజు, తిరుపతి, సందీప్, రేణుక తదితరులున్నారు.

### అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: ఆసుపత్రుల్లో పనిచేసేవారు అకస్మాత్తుగా సంభవించే అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకునేందుకు కనీస అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని కమాన్ ప్రాంతంలోగల ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఆసుపత్రులు, పాఠశాలల్లో అగ్నిప్రమాద నియంత్రణ పరికరాలను అందుబాటులో ఉంచుకుని ఆయా పరికరాల వినియోగంతో ప్రమాదాలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుల్తానాబాద్/పెద్దపల్లిరూరల్: జిల్లాలో వైద్య సేవలను మరింతగా విస్తృతపర్చేందుకు వీలుగా కొత్త పీహెచ్‌సీలను మంజూరు చేయాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు కొండి సతీష్, మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు.

### రైతులకు అందుబాటులో కేంద్రాలు ప్రారంభించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఓదెల(పెద్దపల్లి): గ్రామాల్లో రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతుహక్కుల రాష్ట్ర కార్యదర్శి బియ్యపు శంకర్ శుక్రవారం అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలో ఇటీవల వరుసగా కురిసిన వడగండ్ల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. వర్షానికి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు తుంగాని సాయిలు, ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బోయిని కుమార్, గ్రామ కార్యదర్శి సంగ కుమార్ ఉన్నారు.




## అధికారుల్లేని
# టౌన్ 'ప్లానింగ్'

- రామగుండం బల్దియాలో సిబ్బంది కొరత
- 16 మందిలో పని చేస్తున్నది ఇద్దరు ఉద్యోగులే
- ఉన్న ఇద్దరికీ ఇతర మున్సిపాలిటీల్లో అదనపు బాధ్యతలు
- ఎల్‌ఆర్‌ఎస్‌లో బల్దియాకు 7,061 దరఖాస్తులు
- అర్జీల పరిశీలనకు ఇబ్బందులు
- తాత్కాలిక సైట్ ఇంజినీర్ల నియామకంపై అధికారుల దృష్టి
- ఎల్‌ఆర్‌ఎస్‌తో సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. బల్దియాకు ఆదాయం సమకూరే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ కూడా ముఖ్యమైనదే. అలాంటి విభాగంలో సరిపడా అధికారులు, సిబ్బంది లేరు. ఉన్నవారిలో ఎక్కువగా డిప్యుటేషన్ల మీద మరో మున్సిపాలిటీల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఇద్దరు టీపీఎస్‌లు రెండుమూడు మున్సిపాలిటీలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. కాగా మూడున్నరేళ్ల తర్వాత ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీం) ద్వారా ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. సిబ్బంది కొరతతో తలమునకలవుతున్న టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది.

**డిప్యుటేషన్‌లో వెళ్లినవారికి జీతం ఇక్కడే..**

రామగుండం నగరపాలక సంస్థకు కేటాయించిన టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులు, ఉద్యోగులు ఇతర మున్సిపాలిటీలకు డిప్యుటేషన్ మీద వెళ్లి పని చేస్తున్నారు. కానీ వారికి జీతాలను మాత్రం రామగుండం నగరపాలక సంస్థ నుంచే చెల్లిస్తున్నారు. సిబ్బంది కొరతతో తల్లడిల్లుతున్న రామగుండంకు టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులను కేటాయించడంలో అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని విమర్శలొస్తున్నాయి.

**7,061 దరఖాస్తులు**

2019లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించగా, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల నుంచి 7,061 వరకు దరఖాస్తులు వచ్చాయి. స్థలాల యజమానులు రూ.1,000 చెల్లించి ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. స్థలాల క్రమబద్ధీకరణతో బల్దియాకు సుమారు రూ.20 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**సైట్ ఇంజినీర్ల నియామకంపై దృష్టి**

రామగుండం బల్దియాలో ప్రస్తుతం ఇద్దరు టీపీఎస్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా, ఆ ఇద్దరు ఉద్యోగులకే మరికొన్ని మున్సిపాలిటీలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇలాంటి తరుణంలో బల్దియాకు వచ్చిన 7,061 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఈ ఇద్దరు టీపీఎస్ ఉద్యోగులు పరిష్కరించడం సాధ్యం కాదని తెలుస్తోంది. ఇందు కోసం మరికొందరు గ్రాడ్యుయేషన్ కలిగిన సైట్ ఇంజినీర్లను తాత్కాలికంగా తీసుకోవడంపై అధికారులు దృష్టిసారించారు.

### పని చేస్తున్నది ఇద్దరే..

టౌన్ ప్లానింగ్ విభాగానికి కేటాయించిన 16 మంది ఉద్యోగులల్లో కేవలం ఇద్దరే ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఏసీపీలకు బదులు ఒకరిని కేటాయించగా, సదరు ఏసీపీ డిప్యుటేషన్‌లో జగిత్యాల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నాడు. మరో ఏసీపీ పోస్టులో ఎవరూ భర్తీ కాలేదు. టీపీఓ స్థాయి అధికారి కూడా డిప్యుటేషన్‌లో నిజాంపేట మున్సిపాలిటీలో పని చేస్తున్నాడు. అలాగే నలుగురు టీపీఎస్‌లకు ఒక టీపీఎస్ మంచిర్యాలలో, మరో టీపీఎస్ ఖమ్మం జిల్లాలో, ఇంకో టీపీఎస్ మీర్‌పేట్ మున్సిపాలిటీల్లో డిప్యుటేషన్లలో పని చేస్తున్నారు. ప్రస్తుతం సతీశ్, యశ్వంత్ అనే ఇద్దరు టీపీఎస్‌లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సతీశ్‌కు రామగుండంతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, యశ్వంత్‌కు రామగుండంతోపాటు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, చెన్నూరు, మంథని మున్సిపాలిటీల్లో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉంటే ఆరు టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. అలాగే టౌన్ సర్వేయర్ పోస్టు, టౌన్‌ప్లానింగ్ ట్రేసర్ పోస్టు, క్యాడ్ ఆపరేటర్ పోస్టులో కూడా ఉద్యోగులను భర్తీ చేయలేదు.

### సైట్ ఇంజినీర్లను నియమిస్తాం



రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి అవసరమైన సైట్ ఇంజినీర్లను నియమిస్తాం. టౌన్ ప్లానింగ్ విభాగంలో నెలకొన్న సిబ్బంది కొరత తీర్చడానికి ఉన్నతాధికారులకు కూడా నివేదించాం. ఎల్‌ఆర్‌ఎస్ అర్హత కలిగిన స్థల యజమానులకు సమాచారం తెలియజేస్తున్నాం. – బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, రామగుండం

# కారోబార్లకు కష్టాలే..

## అత్తెసరు వేతనాలు.. కానరాని గుర్తింపు



చెత్త తీస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కారోబార్.. అంటే గ్రామ పంచాయతీకి ఆల్‌రౌండర్. ఇంటి పన్నులు, రికార్డుల నిర్వహణ, సమాచారం, జనన–మరణాల నమోదు, పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, తాగునీరు, పారిశుధ్యం, మురుగు నిర్వహణ, డ్రైవింగ్, మెకానిక్, వీధిదీపాలు.. ఒకటేమిటి.. పంచాయతీ పరిధిలో దాదాపు 30కిపైగా విధులు నిర్వహిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతీ గ్రామ పంచాయతీకి వీరు ఆరో ప్రాణం. అంతటి ప్రాధాన్యమున్న కారోబార్, పంచాయతీ సిబ్బంది తమకు కనీస వేతనాలు, హక్కుల కోసం సమ్మెకు దిగుతున్నారు. ఇప్పటికే సమ్మె నోటీసులను ఆయా జిల్లాలో పంచాయతీ అధికారులకు అందజేశారు.

**అసలేంటి విధానం?**

గ్రామ పంచాయతీలో వివిధ పనుల నిర్వహణకు స్థానికులను గతంలో కారోబార్‌లుగా నియమించుకుంది. వీరిని పంచాయతీ తీర్మానం ద్వారా విద్యార్హతలు, నైపుణ్యం ఆధారంగా వీరిని చేర్చుకునేవారు. ఉదాహరణకు డిగ్రీ ఆపైన చదవిన వారికి బిల్ కలెక్టర్, రికార్డుల నిర్వహణ వంటి పనులు, డ్రైవింగ్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్ పని తెలిసిన వారికి అవే ఉద్యోగాలు, మిగిలిన వారిని సపాయి కార్మికులుగా నియమించుకునేవారు. వీరిలో రికార్డుల నిర్వహణ, బిల్లుల వసూలు, సమాచార సేకరణ వంటి రాతపనులు చూసేవారిని కారోబార్‌లుగా, మిగిలిన వారిని సిబ్బందిగా పిలిచేవారు.

- ఇదే క్రమంలో 2019లో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లను నియమించుకుంది. అదే సమయంలో ప్రభుత్వం జీవో నెం.51 విడుదల చేసింది. దీని ప్రకారం.. గ్రామ పంచాయతీలో పనిచేసే సిబ్బందిని మల్టీపర్పస్ వర్కర్(ఎంపీడబ్ల్యూ)గా నామకరణం చేసింది. ఏ పనిచెబితే ఆ పని చేయాల్సి ఉంటుంది.
- ప్రతీ గ్రామానికి ఐదుగురు చొప్పున వీరిని నియమించారు. ఒకప్పుడు రూ.2,000 నుంచి రూ.3,000లకు పనిచేసిన వీరికి జీవో నెం.51 కారణంగా రూ.8,500 చొప్పున వేతనం ఇచ్చేవారు. ప్రతీ 500 మందికి ఒక కారోబార్ ఉండాలన్న నిబంధన తీవ్ర ప్రతికూలంగా మారింది. వెయ్యి జనాభా ఉన్న గ్రామంలో ఐదుగురు కారోబార్‌లు ఉంటే అందులో కేవలం ఇద్దరికే రూ.8,500 చొప్పున ఇస్తారు. దాన్నే అంతా పంచుకోవాల్సిన దుస్థితి. డ్రైవర్లు, ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు మరణించినా.. వారి కుటుంబాలకు పరిహారం దక్కడం లేదు.
- ప్రస్తుతం దాదాపుగా అన్ని గ్రామాల్లో కారోబార్‌లు జేపీఎస్‌లకు సహాయకులుగా వ్యవహరిస్తున్నారు. అలా కుదరని పక్షంలో జీవో 51 ప్రకారం.. డిగ్రీ, పీజీలు చదివినా సరే డ్రైవింగ్, ప్లంబింగ్, చివరికి సఫాయి కార్మికునిగా కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 30 ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు ఎప్పటికైనా మంచి భవిష్యత్తు దక్కుతుందన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు.

### వీరి డిమాండ్లు ఏంటి?

- గతంలో కారోబార్లుగా వ్యవహరించిన అందరినీ జేపీఎస్‌లకు సహాయకులుగా అధికారికంగా నియమించాలి. వీరికి గ్రామ పంచాయతీ కార్యదర్శి హోదా కల్పిస్తూ.. రూ.21,500 వేతనం అందించాలి.
- 500 ఒక కారోబార్ కాకుండా.. గ్రామ పంచాయతీలో ఇప్పటికే పనిచేస్తున్న కారోబార్లందరికీ రూ.15,500 చొప్పున వేతనాలు ఇవ్వాలి.
- కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి.
- జీవో నెం.51కు కారోబార్లు సిబ్బంది సమస్యలకు అనుగుణంగా సవరణలు చేయాలి.
- కారోబార్, సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ సదుపాయం కల్పించాలి.
- సిబ్బందిలో ఎవరు ప్రమాదవశాత్తు మరణించినా వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.

### వెంటనే ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 51 కారణంగా కారోబార్లు, సిబ్బంది అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మల్టీపర్పస్ వర్కర్ పేరిట అందరినీ దాదాపుగా సఫాయి కార్మికులుగా చూస్తున్నారు. విధినిర్వహణలో మా ప్రాణాలు పోయినా.. పరిహారం కూడా అందడం లేదు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలి.

– బింగి గణేశ్, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్ సిబ్బంది యూనియన్

| జిల్లా | గ్రామపంచాయతీలు | సిబ్బంది | కారోబార్‌లు |
|---|---|---|---|
| కరీంనగర్ | 330 | 1,252 | 245 |
| జగిత్యాల | 414 | 1,651 | 326 |
| పెద్దపల్లి | 315 | 1,254 | 214 |
| రాజన్నసిరిసిల్ల | 262 | 1,035 | 223 |

# నిర్మాణరంగ కార్మికులందరికీ ఆరోగ్య పరీక్షలు

- కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ

కోల్‌సిటీ(రామగుండం): జిల్లాలోని నిర్మాణరంగ కార్మికులందరికీ సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు. గోదావరిఖని గంగానగర్‌లోని న్యాక్ భవనంలో నిర్వహిస్తున్న నిర్మాణ రంగ కార్మికుల వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మాణ రంగ కార్మికులకు బీపీ, షుగర్, చెవి, కంటి పరీక్ష, రక్త, మూత్ర తదితర 50కిపైగా పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులు తమ ఆధార్ కార్డు, నిర్మాణరంగ కార్మికుల గుర్తింపు కార్డుతో వచ్చి తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలని సూచించారు.



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

**బార్‌కోడ్‌తో ఆరోగ్య కార్డు**

నిర్మాణరంగ కార్మికులకు వైద్య పరీక్షలు పూర్తి చేసిన తర్వాత బార్‌కోడ్‌తో ఆరోగ్య కార్డు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్డులో కార్మికుడి వైద్య పరీక్షల ఫలితాలు ఉంటాయని, భవిష్యత్తులో కూడా ఈ కార్డు ఉపయోగపడుతుందన్నారు. రామగుండం క్యాంపులో ఇప్పటివరకు 350 మందికి పైగా పరీక్షలు నిర్వహించామని, మరో వారం రోజులపాటు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మే నెలలో పెద్దపల్లిలో, జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో క్యాంప్ ప్రారంభించి కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**ఎఫ్ఎస్‌టీపీ పనులు పూర్తి చేయండి**

రామగుండం బల్దియా మల్కాపూర్ శివారులో నిర్మిస్తున్న ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ సంగీత సత్యనారాయణ పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు, గోదావరిఖని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.శ్రీకాంత్, క్యాంప్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి తదితరులు ఉన్నారు.

# కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం తెలుపుతున్న సంతోష్‌కుమార్

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్ కోరారు. శుక్రవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల కోసం పంచాయతీ కార్యదర్శులను నియామకం చేసిందని, మరో ఏడాది పొడగింపు చేయడంతో పాటు రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ చేయకపోవడంతో నిరసన కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు పని ఒత్తిడి కారణంగా అనేకమంది మరణించారని, వారి కుటుంబాలను కారుణ్య నియామకాల ద్వారా ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో పకడ్బందీగా అమలు చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నామని, రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాగా కార్యదర్శుల నిరసన కార్యక్రమానికి ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ఫయాజ్ అలీ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు కోయడ కొమురయ్య, కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న, ఎంపీడీవో స్టాఫ్ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు నిషాంత్‌రావు, ఉమాపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఓదెలలో మినీ కోర్టు ప్రారంభం

ఓదెల(పెద్దపల్లి): ఓదెలలోని రైతువేదికలో శనివారం మినీ కోర్టును జిల్లా జడ్జి హేమంత్ రెడ్డి ప్రారంభిస్తారని మండలం ఇన్‌చార్జి వ్యవసాయాధికారి నాగార్జున తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని పేర్కొన్నారు.

# తూర్పున హై అలర్ట్



- దంతెవాడ బ్లాస్టింగ్‌తో అప్రమత్తమైన సరిహద్దు జిల్లాలు
- గోదావరి తీరంలో అడుగడుగునా నిఘా పటిష్టం

మంథని: తెలంగాణ సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టులు మందుపాతర పేల్చి 11 మందిని బలితీసుకున్న నేపథ్యంలో కరీంనగర్ తూర్పు డివిజన్ గోదావరి మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు సరిహద్దు వెంట పోలీసులు నిఘా కట్టుదిట్టం చేసినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎత్తున పోలీస్ బలగాలు మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం చేపట్టడంతో.. సరిహద్దుల్లోని తెలంగాణ జిల్లాల అటవీ ప్రాంతంలోకి మావోయిస్టులు అడుగుపెడతారనే నిఘా వర్గాల సమాచారం మేరకు సరిహద్దు జిల్లాల పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైనట్లు తెలిసింది.

- ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి గోదావరినది దాటితే తెలంగాణ బార్డర్ అడవుల్లోకి మావోయిస్టులు ప్రవేశించే అవకాశం ఉండడంతో వారి చొరబాట్లను కట్టడి చేసేందుకు పోలీసులు గోదావరి తీరం వెంట డేగ కళ్లతో నిఘా పెట్టినట్లు సమాచారం.
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ గోదావరి నది తీరం వెంట గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపించినా, కొత్తవారు సివిల్ దుస్తుల్లో సంచరించినా తక్షణమే సమాచారం ఇవ్వాలని ఆయా ఠాణాల పరిధిలో పోలీస్ అధికారులు, గ్రామస్తులతో పాటు వారికి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చే వర్గాలను సైతం అప్రమత్తం చేసినట్లు తెలుస్తోంది.
- కాగా దంతెవాడ జిల్లాలో దారుణ మారణహోమానికి ఒడిగట్టిన మావోయిస్టులు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోనే తలదాచుకునే అవకాశాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు.
- ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎత్తున కూంబింగ్ జరుగుతున్న నేపథ్యంలో షెల్టర్ జోన్‌గా భావిస్తున్న కరీంనగర్ తూర్పు డివిజన్‌లోని ముకునూరు, నీలంపల్లి దట్టమైన అడవులతో కూడిన గుట్టల్లో మావోయిస్టులు మకాం వేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించినట్లు సమాచారం.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఛత్తీస్‌గఢ్ బార్డర్ దాటి తెలంగాణ అడవుల్లోకి ప్రవేశించకుండా అన్ని మార్గాల్లో గట్టి భద్రతో ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉన్నట్లు తెలిసింది.
- కాగా తెలంగాణ పోలీస్ యంత్రాంగం చేపట్టే చర్యలను మావోయిస్టులు సైతం తక్కువ అంచనా వేయరన్న వాదన ఉంది. భద్రత కోసం తెలంగాణ అడవుల్లోకి ప్రవేశిస్తే భారీ మూల్యం చెల్లించే అవకాశాలు లేకపోలేదన్న భయం మావోయిస్టుల్లో ఉందనడానికి గతంలో జరిగిన పలు ఘటనలు నిదర్శనం.
- ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులు అంత సులభంగా తెలంగాణ అడవుల్లో తలదాచుకోవడానికి వచ్చినా ఎలాంటి హింసాత్మక చర్యలకు పాల్పడే అకకాశం లేదని పరిశీలకులు భావిస్తునారు.
- ఏది ఏమైనా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక చర్యలు చేపట్టిన ప్రతీసారి సరిహద్దు గ్రామాల ప్రజలు భయం నీడలో కాలం వెల్లదీయాల్సి వస్తోంది.

### ఓటరు లిస్టు నుంచి మృతుల పేర్లు తొలగించాలి

ఓదెల(పెద్దపల్లి): ఓటరు లిస్టు నుంచి మృతుల పేర్లను తొలగించాలని పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొలనూర్ గ్రామంలో తొలగించిన పేర్లను ఇంటింటా ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఓటు హక్కు కోసం యువకులు బీఎల్వోల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్టులో పేర్ల సవరణను కూడా సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ రాజేందర్, అంగన్‌వాడీ టీచర్ బాలసాని సుజాత పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మే డే గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

ఫెర్టిలైజర్ సిటీ(రామగుండం): రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో కార్మిక హక్కుల పరిరక్షణకై 137వ మే డే ఘనంగా నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేశ్ పిలుపునిచ్చారు. ప్లాంట్ ఆవరణలో శుక్రవారం మే డే గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. చికాగో అమరవీరుల త్యాగానికి గుర్తుగా మే డే నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులను శ్రమను దోపిడీ చేసి, కార్పొరేట్ కంపెనీలకు, బడా వ్యాపారులకు దోచిపెడుతోందని ఆ రోపించారు. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె.మొగిలి, ఆర్‌ఎఫ్‌సీఎల్ బ్రాంచి నాయకులు బాసవేణి రమేశ్, తిప్పని రాంకీ, ఐద శ్రావణ్, ఆర్కుటి కుమార్, సురేశ్, మహేశ్, రాకేశ్, సతీశ్ పాల్గొన్నారు.

### టీఎస్‌పీఎస్సీ అవకతవకలపై రాష్ట్రపతికి రిజిస్టర్ పోస్టు



రిజిస్టర్ పోస్టును పోస్టాఫీసులో ఇస్తున్న విజయ్‌కుమార్

గోదావరిఖనిటౌన్(రామగుండం): ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలకు పాల్పడి, నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన టీఎస్‌పీఎస్సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దాసరి విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు గోదావరిఖని పోస్టాఫీసు నుంచి రిజిస్టర్ పోస్టు పంపించారు. గ్రూప్–1, ఏఈఈ, ఏఈ మరో 15 పేపర్ల లీకేజీ కారణంగా దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులు నష్టపోయారని లేఖలో పేర్కొన్నారు. నేరస్తులను కాపాడేందుకే ఈ కేసును బీఆర్ఎస్ ప్రభుత్వం సిట్‌కు అప్పగించిందని ఆరోపించారు. సిట్‌పై నిరుద్యోగులకు నమ్మకం లేదని, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని, సీబీఐ ద్వారా దర్యాప్తు జరిపించాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

### ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సరళ

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో భాగంగా శుక్రవారం లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ సరళ కార్మికులకు అవగాహన కల్పించారు. పనిచేసే సమయంలో ఎవరికైనా గుండెపోటు వస్తే సీపీఆర్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు, ఆసుపత్రి సీవో పారిజాతం, సిబ్బంది సురేశ్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

# మే 2న ఓపెన్ ప్లాట్ల వేలం

- కలెక్టర్ సంగీత
- క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత, అధికారులు

రామగుండం: అంతర్గాం మండలంలోని కుందనపల్లి గ్రామ శివారు రాజీవ్ రహదారి ఇంధన నిల్వల కేంద్రాల సమీపంలో గల రాజీవ్ స్వగృహ అక్షయ టౌన్‌షిప్‌లో ఓపెన్ ప్లాట్లను కలెక్టర్ సంగీత శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్షయ టౌన్‌షిప్‌లోని 22 ఓపెన్ ప్లాట్లకు మే 2వ తేదీన గోదావరిఖని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లాట్లను మూడు విభాగాలుగా విభజించామని, 250 నుంచి 470 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న తొమ్మిదింటికి టైప్–ఏ ధర చదరపు అడుగు రూ.5 వేలు, 200 నుంచి 389 చ.గ. ఉన్న 9 ప్లాట్లకు టైప్–బీ, 150 నుంచి 382 చ.గ. విస్తీర్ణంలో ఉన్న 4 ప్లాట్లకు టైప్–సీ ధర చదరపు అడుగు రూ.4,500 చొప్పున నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ప్రత్యేక వేలంలో పాల్గొని, ప్లాట్లు సొంతం చేసుకోవాలని కోరారు. తొలిసారి వేలంలో పాల్గొనేవారు ఒక ప్లాట్ వేలంలో పాల్గొంటే రూ.10 వేల డీడీని జిల్లా కలెక్టర్ పేరిట తీయాల్సి ఉంటుందన్నారు. వేలంలో ప్లాట్లు దక్కించుకోని వారికి డీడీని వాపస్ ఇస్తామని చెప్పారు. పాత రాజీవ్ స్వగృహ దరఖాస్తుదారులు ఎవరైనా రూ.3,500, రూ.5 వేలు రిజిస్ట్రేషన్ రుసుము చెల్లిస్తే ఒరిజినల్ మీ సేవ రసీదును సమర్పించి, వేలంలో పాల్గొనాలని సూచించారు. ప్లాట్ దక్కించుకున్నవారు వారం రోజుల్లోగా ప్లాట్ ధరలో మొదటి విడత 33 శాతం, రెండో విడత 45 రోజుల్లో 33 శాతం, మిగిలిన మొత్తాన్ని 90 రోజుల్లోగా చెల్లించాలన్నారు. ఆ తర్వాత కలెక్టర్ కార్యాలయం నుంచి ఎన్‌వోసీ జారీ చేస్తారని తెలిపారు. దీంతో గృహ నిర్మాణానికి, బ్యాంక్ రుణం కోసం దరఖాస్తు చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు.

**పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..**

గోదావరిఖనిలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ఓపెన్ ప్లాట్ల వేలానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ సంగీత ఆదేశించారు. వేలంలో పాల్గొనేందుకు వచ్చేవారి కోసం కౌంటర్, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట సెక్షన్ సూపరింటెండెంట్ పుష్పలత, అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్ తదితరులున్నారు.

# రామగుండం నిధులు ఇతర జిల్లాలకు..

- అన్ని వనరులున్నా అభివృద్ధిలో వెనుకంజ
- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

పాలకుర్తి(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అన్ని వనరులున్నా అభివృద్ధిలో మాత్రం వెనుకబడే ఉందని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ, పీసీసీ అధికార ప్రతినిధి జనక్‌ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 4,200 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గానికి లేని నైసర్గిక స్వరూపం రామగుండం సొంతమని, బొగ్గు, నీరు, విద్యుత్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి ఏపీ మాజీ సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జైపూర్‌లో విద్యుత్ ప్లాంట్, స్థానికంగా తాగు, సాగునీటి సమస్యను తీర్చేందుకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించారని గుర్తు చేశారు. డీఎంఎఫ్‌టీ నిధులు దాదాపు రూ.2,800 కోట్లను సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. వాటిని సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి వెచ్చించకుండా సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. గోదావరిఖనిలో ఫ్లైఓవర్ లేని కారణంగా దాదాపు 50 మంది కార్మికులు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందారని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు శుద్ధమైన తాగునీరు అందించే పరిస్థితి లేదని, మురికినీరు సరఫరా చేస్తూ కార్మిక కుటుంబాల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు భృతి ఇస్తామన్న సీఎం కేసీఆర్ ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. దాదాపు 40 ఏళ్లుగా కార్మిక నాయకుడిగా సేవలందిస్తున్న తాను రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రామగుండం నియోజకవర్గ టికెట్‌ను ఆశిస్తున్నానని, ప్రజలు తనను ఆదరించాలని కోరారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్, ఎట్టం కృష్ణ, మహేశ్‌బాబు, ఆంజనేయులు, అల్లావుద్దీన్, తాటి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## జేపీఎస్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్



దీక్షలకు సంఘీభావం ప్రకటించిన మక్కాన్‌సింగ్

రామగుండం: జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఠాకూర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండల పరిషత్ ప్రాంగణంలో జేపీఎస్‌లు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం ప్రకటించారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత కాంట్రాక్టు వ్యవస్థ ఉండదన్న సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలతో పంచాయతీ కార్యదర్శులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నప్పటికీ కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్రాల పర్యటన చేస్తూ కోట్లాది నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ సాధారణ, మధ్య తరగతి నిరుద్యోగుల పాలిట శత్రువుగా మారారని ఆరోపించారు. ఇప్పటికైనా జేపీఎస్‌ల క్రమబద్ధీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వకుంటే వారికి బాసటగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని స్పష్టం చేశారు. సంఘీభావం ప్రకటించిన వారిలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, పెంద్రు హన్మాన్ రెడ్డి, మద్ది తిరుపతిగౌడ్, యుగంధర్, గాదె సుధాకర్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, కోల రమేష్, గజ్జెల నాగరాజు, కాంపెల్లి సంతోష్ తదితరులున్నారు.

## గొయ్యిలో పడి.. బియ్యంలో కూరుకుపోయి

- చందనాపూర్ రైస్‌మిల్లులో యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగిరి మండలంలోని చందనాపూర్ గ్రామానికి చెందిన గాండ్ల కిరణ్(32) అనే కూలీ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిరణ్ శుక్రవారం చందనాపూర్‌లోని రైస్ మిల్లుకు కూలీ పనికి వెళ్లాడు. రైస్ బంకర్ కింద గడ్డపారతో గొయ్యి తవ్వుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు బంకర్ రేకులు ఊడిపోయి, అందులో ఉన్న దాదాపు వంద క్వింటాళ్ల బియ్యం ఒక్కసారిగా కిరణ్‌పై కూలాయి. ఈ ప్రమాదంలో అతను తాను తవ్వుతున్న గొయ్యిలోనే పడిపోయి, బియ్యంలో కూరుకుపోయాడు. ఈ సమయంలో అక్కడే ఉన్న కిరణ్‌తో పని చేసే మామిడిశెట్టి హరీశ్, కట్కూరి సమ్మయ్య, చిగురు స్రవంతి, మాధురి సారక్క, లత, శకుంతల చూసి, బియ్యాన్ని తొలగించి, అతన్ని కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే మృతిచెందడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ రెడ్డి తెలిపారు.

## కార్మికుల శ్రేయస్సును విస్మరించిన బీజేపీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకర్, నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికుల శ్రేయస్సును విస్మరించిందని కాంట్రాక్టు కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి చిలుక శంకర్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చికాగో కార్మికులు ఎనిమిది గంటల పని దినాల కోసం చేసిన వీరోచిత పోరాటానికి 01–05–2023తో 137 ఏళ్లు అవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ, కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సంఘం బ్రాంచి కార్యదర్శి బుచ్చన్న, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, రాయమల్లు, సుధాకర్, వసంత్, తిరుపతి, రాజయ్య, రాజన్న పాల్గొన్నారు.


## కంటి వెలుగు శిబిరాలను వినియోగించుకోవాలి

జ్యోతినగర్(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కృపాబాయి అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం సందర్శించారు. నేత్ర పరీక్షల అనంతరం ఉచితంగా మందులతో పాటు కళ్లజోళ్లు కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్ కొలిపాక సుజాత, డాక్టర్ పవన్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### తత్కాల్ రెండో కౌంటర్ ప్రారంభం

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం బుకింగ్ కౌంటర్‌లో తత్కాల్ రెండో కౌంటర్‌ను ప్రారంభించినట్లు రైల్వే ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల ముందు బయలుదేరే అన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రధాన రూట్లకు దేశవ్యాప్తంగా తత్కాల్ టికెట్ల జారీ ప్రారంభించిన క్షణంలోనే రెండో వ్యక్తికి టికెట్లు లభ్యం కావడం లేదు. ఇదిలా ఉండగా వారణాసిలో గంగా పుష్కరాలు కొనసాగుతున్న క్రమంలో పాట్నా వైపు ఉన్న ఒకే రైలుపై భక్తులు ఆధారపడాల్సి వస్తుంది. ఇదే పరిస్థితి అయ్యప్ప భక్తులు శబరిమలై వెళ్లే సమయంలో కూడా ఎదురైంది. కాగా తత్కాల్ కోసం 10 గంటల ముందు క్యూలైన్‌లో నిలబడితే కేవలం మొదటి వ్యక్తికే టికెట్లు దొరికే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైల్వే ప్రజాసంబంధాల మాజీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ ప్రయాణికుల బాధను గుర్తించి గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు లిఖితపూర్వకంగా సమస్యను వివరించడంతో స్పందించిన జీఎం తక్షణమే రెండో తత్కాల్ కౌంటర్ ఏర్పాటుకు కమర్షియల్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. తత్కాల్ రెండో కౌంటర్ ఏర్పాటుతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా పుష్కరాల తర్వాత కూడా ఇలాగే రెండో కౌంటర్ కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### మొక్కల పెరుగుదలకు సేంద్రియ ఎరువులు వాడాలి



అధికారులకు సూచనలిస్తున్న డీఎఫ్‌వో శివయ్య

పాలకుర్తి(రామగుండం): నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెరుగుదలకు సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా ఫారెస్ట్ అధికారి శివయ్య సూచించారు. శుక్రవారం పాలకుర్తి మండలం బామ్లానాయక్‌తండా గ్రామాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఫారెస్ట్ అధికారి శివయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, మెగా పల్లెప్రకృతి వనాన్ని సందర్శించి వాటిలో మొక్కల పెరుగుదలకు పలు సూచనలు చేశారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా నాటే మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, మండల పంచాయతీ అధికారి షబ్బీర్‌పాషా, సర్పంచ్ బదావత్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గుబాయి వార్తలు

# సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వండి



సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న సీఐటీయూ నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం ఎదుట ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు సంబంధించి 2018 నుంచి సీఎంపీఎఫ్ వివరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటి వివరాలు వెంటనే ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో గోదావరిఖనిలోని అధికారులను అనేకసార్లు కలిసి వినతి పత్రాలు అందజేసినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన డబ్బులు ఉన్నాయా లేవా అనే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై సింగరేణి, సీఎంపీఎఫ్ అధికారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ఏంటని మండిపడ్డారు. పని మానేసిన, చనిపోయిన కాంట్రాక్టు కార్మికులు పెట్టుకున్న విత్‌డ్రా, పనిలో ఉన్న వారి లోన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికోసం దళారులు, బ్రోకర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో 2500 మంది కన్వెన్షన్ డ్రైవర్లు, 200 మంది నర్సరీ కార్మికులు, 9 వేల మంది ఓబీ కార్మికులు సీఎంపీఎఫ్ అమలుకు నోచుకోలేదన్నారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేకుంటే రాబోయే రోజుల్లో తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా ధర్నాకు స్పందించిన సీఎంపీఎఫ్ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మధు, నాయకులు శీను, వేల్పుల కుమారి, దూలం శ్రీనివాస్, గట్టు మహేందర్, సీహెచ్.ఉపేందర్, చిప్పకుర్తి అరవింద్, అంబాల ఓదెలు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 వీటీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టులు, కోల్ ట్రాన్స్‌పోర్ట్, సీఎస్పీలు, ఓసీపీల వద్ద జాగ్రత్తగా లేకపోతే ఆ ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణాపై పడుతుందని తెలిపారు. దొంగతనాలు జరగకుండా, బొగ్గు రవాణాకు అవాంతరాలు ఏర్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి రమణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరాజం, జూనియర్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, జమేదార్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి

- వకీల్‌పల్లి ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

గోదావరిఖని(రామగుండం): కాలానికనుగుణంగా దినచర్యతోపాటు ఆహారపు అలవాట్లలో మార్పు రావాలని ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, వకీల్‌పల్లి ఏజెంట్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆకస్మిక మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం వకీల్‌పల్లి గనిపై గుండెజబ్బుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. చిన్న అశ్రద్ధ వల్ల భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తోందని, మంచి ఆహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. ప్రతీ ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే నిర్దేశిత లక్ష్యాలను అధిగమించే వీలుంటుందన్నారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, గని మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, సంక్షేమ అధికారి ఓంకారి బాబు, పిట్ సెక్రటరీ వై.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తితోపాటు రక్షణపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలిచిన జీడీకే–11 గని కార్మికుల పనితీరు అభినందనీయమని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి, వార్షిక లక్ష్యాలు సాధించాలని పేర్కొన్నారు. శుక్రవారం జీడీకే–11 గనిని సందర్శించి, కార్మికులనుద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించారన్నారు. ఉత్పత్తితోపాటు రక్షణపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం గనిలోని పలు సీంల వివరాలు, ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ చర్యలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గని ఏజెంట్ శ్రీనివాస్, మేనేజర్ నెహ్రూ, గ్రూప్ ఇంజనీర్ బి.రాందాస్, గని పిట్ సెక్రటరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవి ప్రమాదాలను నివారించండి

గోదావరిఖని(రామగుండం): వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిలో గనుల్లో పనిచేసే ఉద్యోగులు, ఎండదెబ్బకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గనులు, వర్క్‌షాపులు, యంత్రాల మరమ్మతుల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. యంత్రాల వేడివల్ల, విద్యుత్ సరఫరా తీరులో అనుకోకుండా జరుగు ప్రమాదాలను నివారించుటకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ప్రాజెక్ట్ అధికారి ఎస్.మధుసూదన్, ఎస్ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, వీటీసీ మేనేజర్ రంగారెడ్డి పాల్గొన్నారు.

## యువ కార్మికుల చేతుల్లోనే సింగరేణి భవిష్యత్

గోదావరిఖని(రామగుండం): యువ కార్మికుల చేతుల్లో సింగరేణి భవిష్యత్ ఉందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జనక్‌భవన్‌లో జరిగిన యువ ఉద్యోగుల సమ్మేళనంలో మాట్లాడారు. తమ యూనియన్‌లో 50శాతం కీలక పదవులు యువతకే కేటాయిస్తామన్నారు. చదువుకున్న యువ కార్మికులకు వారి విద్యార్హతను బట్టి ప్రమోషనల్ పాలసీ, క్యాడర్ స్కీం అమలయ్యేలా చూస్తామన్నారు. తమ యూనియన్ గుర్తింపు సంఘంగా గెలిపిస్తే 20 కొత్త బొగ్గు గనులు ప్రారంభించి, 20 వేల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. అలాగే అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసి సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని పేర్కొన్నారు. సదానందం, ధర్మపురి, వడ్డేపల్లి దాస్, వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య



సంధ్యారాణి (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామానికి చెందిన శనిగరం సంధ్యారాణి (26) ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా కాచాపూర్ గ్రామానికి చెందిన సంధ్యారాణికి యైటింక్లయిన్ కాలనీకి చెందిన శ్రీనివాస్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉంది. సంధ్యారాణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. సింగరేణి ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్‌లో ప్రైవేట్ కార్మికునిగా పనిచేసే శ్రీనివాస్ శుక్రవారం విధులు ముగించుకొని, ఇంటికి వచ్చేసరికి ఆమె చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సంఘటన స్థలాన్ని గోదావరిఖని టూటౌన్ రెండో సీఐ అఫ్జలుద్దీన్ పరిశీలించారు. అనారోగ్య కారణాతోనే ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని స్థానికులు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.